ఆమెను పొందాలని
అతనికొచ్చిన
దుష్ట ఆలోచన
మంచి ఆలోచనగా
ఎలా మారింది?

# అడవి మల్లె

కన్నపూడి విజయలక్ష్మి కథ

పాపాయి బోసినవ్వులా నిర్మలంగా వుంది ఆకాశం. ఆమని రాకతో లేచిగుళ్లతో సింగారించుకున్న చెట్లు... ఎటుచూసినా పచ్చదనంతో శోభిల్లుతోంది. అడివంతా పచ్చచీర కట్టుకున్న పెళ్లికూతుర్లా కళకళలాడుతోంది.

కుహూ...కుహూఅంటూ కమ్మనిపాటలు ఆలపిస్తున్న కోయిలలు... బారులు బారులుగా ఎగుర్తోన్న తెల్లటి కొంగలు. అప్పుడే రెక్కలు విప్పుకుంటూ కువకువలాడుతోన్న పక్షులు... ఓహ్... ప్రకృతి ఎంత రమణీయంగా వుంది. భగవంతుడనే గొప్ప చిత్రకారుడి కుంచెనుండి వెలువడిన ఈ చిత్రపటం మార్వలెస్... ఫెంటాస్టిక్.


తన్మయత్వంతో ఆ సుందర, రమణీయ అద్భుత దృశ్యాన్ని చూస్తున్నాడు శ్రీరావ్. మనసులో భావాల అంతస్తులను పేర్చుకుంటూ అడవి సోయగాలని సొక్కిపోయి చూస్తున్నాడు.

అతని అందమైన భావాలకి... ఆలోచనలకి అంతరాయం కలిగిస్తూ ఘల్లు... ఘల్లుమంటూ అందియల శబ్దం అతని చెవినపడింది. ఆ శబ్దం రానురాను దగ్గరగా... మరింత దగ్గరగా అతనికి వెనుకగా... బాగా సమీపంగా వచ్చి ఆగింది.

భుజం మీదుగా తలతిప్పి ఓరగా చూశాడు. అంతే... అతని కళ్లు ఆశ్చర్యంతో వెడల్పయ్యాయి. గిరుక్కున మనిషి పూర్తిగా ఇటువేపు తిరిగాడు. ఎదురుగా...

బంగారం నిలువెత్తు పోతపోసినట్టు... పద్దెనిమిదేళ్ల లేలేత అందం. కనువిందు చేస్తున్న పరువాలతో బెదురుగా చూస్తోంది.

“ఎవరీ అందాల సుందరీ!” శ్రీరావ్



ఒక్కటంటే ఒక్కటికూడా వదలకుండా ఆమె అందాల్ని కళ్లతోటే తడిమేస్తున్నాడు. అతని చూపు ఆమె దుస్తులని సైతం దాటి. ఆమె అందాల్ని తడుముతోంది.

"దండాలు దొరా!" కోయిల కూసినట్టు ... వీణ మీటినట్టు మళ్లీ మళ్లీ వివాలప్పించేంత మధురంగా... తీయగా వుంది కంఠం.

పులిక్కిపడి తల విదిల్చాడు శ్రీరామ్.

''నాపేరు మోతి''

మోతి అంటే ముత్యంకదూ! అచ్చు అలానే వున్నావు. స్వాతిముత్యంలా వున్నావు.

''బంగ్లా కాపలాదారు నాయక్ కూతుర్ని ... అయ్యకి ఒంట్లో బాగులేదు. అందుకే ఇక్కడ పన్లు సూట్టానికి వొచ్చాను''

మాటలు తడబడినా సూటిగా విషయాన్ని చెప్పింది మోతి.

చేయవలసిన పనులు పురమాయించి ఆలోచనల్లో మునిగిపోయాడు శ్రీరామ్. ఆమె కాలి అందెలు ఘల్లుఘల్లుమంటోంటే అతని నరాలు జివ్వుజివ్వుమంటున్నాయి.

మోతి ఎంత చక్కటిపేరు... సూటబుల్ నేమ్. చాలామంది పేర్లు పెట్టుకుంటారు... అగ్లీగా వున్న అమ్మాయిపేరు సుందరి అవో... గువ్వ ఏనుగులా వున్న పిల్లకి లత అవో బొత్తిగా పొంతనలేని పేర్లు పెట్టుకుంటారు. ఇంతెందుకు తనపేరు శ్రీరామ్ మరి తనో...

అద్దాలని రంగురంగు దారాలతో కుట్టిన ఎర్రటి లంగా, జాకెట్. పయ్యెద లేని ఎదపొంగులు... బంగారంలా మెరుస్తూ నగ్నంగా కన్పించే పచ్చటి పల్చటి పొట్ట... చేతులకి... జబ్బలకి అందమైన దంతపు గాజులు... చెవులకి వేలాడే వెండి ఆభరణాలు... మెళ్లో వెండి గొలుసులు... తల మీదుగా వేసుకున్న పల్చటి వల్లెవాటు. అందులోంచి లీలగా కన్పిస్తోన్నవీపుమీది జాకెట్ తాలూకా తాళ్లు. కాళ్లకి కడియాలు.

లేత ముంజలాంటి పొగసు... కొబ్బరిలాంటి వయసు. బంగినపల్లి మామిడి పండులా... కలకత్తా రసగుల్లలా ఊరించే అందాలు... కృత్రిమమైన పట్నపు నాగరికత సోకని స్వచ్ఛమైన అడవిమల్లె... ఓహ్.

అప్పటివరకు సుమధురమైన భావాల పరంపరతో అతని మనసులో రూపుదిద్దుకుంటున్న కవితకు తెరపడింది. బదులుగా మోతి అతని గుండెల్లో దూరి తిష్టవేసు క్కూర్చుని గిలిగింతలు పెదుతోంది.

ఎలాగైనా ఈ అడవిమల్లెని ఒక్కసారి వాసన చూడాలి. అందాలొలికే సున్నితమైన ఆ పూరెక్కల్ని కసితీరా నలపాలి.

తేనెపట్టులాంటి ఆ ఎర్రటి పెదాలని పీల్చి పిప్పిచేయాలి. కాశ్మీర్ యాపిల్ పళ్లలా నున్నగా మెరుస్తోన్న ఆ బుగ్గలని కసుక్కున కొరకాలి... శ్రీరామ్‌లో కోరిక పడగ విప్పి బుసలు కొదుతోంది... కాటువేయడానికి అదునుకోసం చూస్తోంది.

శ్రీరామ్ అపరశ్రీరామచంద్రుడుకాదు. కంటపడిన ప్రతి పూవులోకి చొచ్చుకుపోయే తుమ్మెదలాంటివాడు. ప్రతి పూవుని గుండెలమీదకి చేర్చుకుంటాడు. తనకి తెల్సిన టెక్నిక్‌లన్నీ ఉపయోగించి... గుండెలోపలికి చేర్చుకోవడం అతని డిక్షనరీలోనే లేదు. అంతటి గొప్ప రసికుడు... కాముదుకు. కానీ...

అతను గొప్ప భావకుడు... అందమైన ప్రతి దానిమీదా ఇంకా ఎంతో అందంగా కవితలు రాయగలదు. ఏకాంత ప్రదేశాలకి వెళ్లి తనకి ఎంతో ఇష్టమైన కవితలు రాస్తుంటాడు. ఇప్పుడీ అడవికి కూడా వచ్చింది అందుకే. పట్టణపు రణగొణధ్వనులకి దూరంగా... ముఖ్యంగా ఆడగాలికి దూరంగా వుండాలని కానీ... ఇక్కడా అదే ఎదురైంది. ప్చ్...

"ఎల్తుండా దొరా!" పనంతా ముగించిన మోతి చెప్పింది.

"ఆ... ఆ... మళ్లీ రేప్పొద్దున్నే వస్తావుకదూ" ఆశగా అడిగాడు.

కళ్లు ఆర్పిపల్లా చేసుకుని ఆశ్చర్యంగా చూసి "మా అయ్యకి బాగైతే ఆడే వత్తాడు" అంటూ వెళ్లిపోయింది.

రేపు మోతీ వస్తుందా? ఏమో! వాళ్లయ్యకి బాగైతే రాదుకాబోలు! నాలుగురోజులపాటు వాళ్లయ్యకి బాగవకుండా వుంటే ఎంత బావుణ్ను శ్రీరావ్‌కు మనసు కోరుకుంటోంది.

పనిచేస్తున్నంతసేపు ఆమెని పరిశీలించి ఓ ముఖ్యమైన విషయాన్ని కనిపెట్టాడు శ్రీరావ్. మోతీ పద్దెనిమిదేళ్ల పడుచే అయినా ఎనిమిదేళ్ల పాపాయంత అమాయకురాలు. లేడీ వేటలో అపారమైన అనుభవం వున్న తను మోతీని తేలిగ్గానే లొంగదీసుకుని తన కోరిక తీర్చుకోవాలని వూహిస్తూ ఆ రాత్రి నిద్రకుపక్రమించాడు.

వూరించే ఆమె అందాలు కళ్లముందు కదుల్తోంటే నిద్ర అతన్ని వెలివేసింది.

మరునాడు నిద్రలేచేసరికి ప్రభుత సుందరిలా దర్శనమిచ్చింది మోతి. శ్రీరావ్ ఆమెని కాంక్షగా చూశాడు. ఆమె పనిలో జొరపడింది.

అర్ధనగ్నంగా కనిపిస్తూ... కవ్విస్తోన్న ఆమె వొంటిని క్రీగంటగా చూస్తూనే తన పనులు ముగించుకున్నాడు.

"నే చెప్పిన పనులన్నీ చెయ్యడానికేగదా మీ అయ్య నిన్ను పంపింది" వెళ్లేముందు ఆమెతో అన్నాడు పెదాలుతడుపుకుంటూ.

"అవును దొరా! ఏంటో సెప్పండి" అంది తడిచేతులని లంగాకి తుడుచుకుంటూ.

"మరయితే నే చెప్పిన పని చేస్తావా?" ఆశగా అడిగాడు.

"ఓ సేత్తానుదొరా!" ఉత్సాహంగాఅంది.

"పనంటే... పని కాదనుకో..." నసిగాడు.

"మరేంటి?"

## అతి పెద్ద సినిమాహాల్

న్యూయార్క్‌లోని 'ది రేడియో సిటీ మ్యూజిక్ హాల్' ప్రపంచంలోకెల్లా అతి పెద్ద సినిమా థియేటర్. 1932 డిసెంబర్‌లో ప్రారంభించబడిన ఈ థియేటర్‌లో ప్రస్తుతం 5,882మంది ప్రేక్షకులు కూర్చునేందుకు ఏర్పాట్లున్నాయి.

— బల్లా సుశీలా ప్రమీల



''నేనేం చేసినా ఎదురుచెప్పకూడదు నువ్వు! అదే పని''

''బలే సిత్రంగా మాట్లాడుతుండావు దొరా! మీ పని మీరు సేసుకుంటా వుంటే నేను ఎదురుసెప్పటం ఏంటి? అయినా నేనుండగా తవరు పనిసేయడం ఏంటి? మీరట్టా కూకోండి నేను సిటెకలో సేత్తాను '' అంది అమాయకంగా.

ఒరే! శ్రీరాప్ యు ఆర్ లక్కీ! నువ్వు ఏమాత్రం కష్టపడకుండానే మోతి నీ దారికొస్తోంది. గొర్రె కసాయివాడ్ని నమ్మినట్టు అమాయకురాలైన ఆమె నిన్ను పూర్తిగా నమ్మింది. నీ పంట పండింది. మాజీవీడు పెద్ద రసంలాంటి పిల్ల నీ సొంతం కాబోతోంది... ప్రొసీడ్. ఆవందంతో అతని మనసు గంతులు వేస్తోంది.

''అబ్బ! అది ఒక్కళ్ళు చేసే పనికాదులే మోతి! కాస్త నీ సాయం కావాలి అంతే'' ఆమె వొంపుసొంపుల్ని రెప్పవాల్చకుండా చూస్తూ అన్నాడు. అతని వొళ్లంతా వెచ్చని ఆవిర్లు కమ్ముకుంటున్నాయి. అతని కళ్లల్లో ఎర్రజీర చేర్తోంది.

''నువ్వు సెప్పేదేంటో నాకు అర్ధంకాటల్లేదు దొరా! సర్లే చెప్పు ఇప్పుడు నన్నేం చెయ్యమంటావో?'' వే అడివికెళ్లి కట్టెలు కొట్టి అమ్ముకురావాలి కొంచెం విసుగ్గా అంది.

పిచ్చిమొద్దు ఏంటో అనుకుంటోంది. అందుకే అంత తొందరపడుతోంది.

''ఇక్కడ కాదు! ఆ గదిలోకి రా'' అంటూ బెడ్రూంలోకి తీసుకెళ్లాడు. ఆమె కేసి ఓరగా చూస్తూ తలుపులు మూసి గెడపెట్టాడు. ఆమె మొహంలో కంగారు... భయం ఏమీ లేవు. ఆమెని మంచంమీద కూచోబెట్టి అన్నాడు.

''కట్టెలు అమ్ముకురావాలి అన్నావుకదా! చెప్పినట్టు వింటే నీకు వందరూపాయలిస్తాను సరేనా'' ఆమె మొహాన్ని పరిశీలనగా చూస్తూ అన్నాడు. అతనాశించినట్టే మోతి మొహంలో చిత్రమైన మార్పు.

''బాబోయ్ ! వంద రూపాయలే?'' ఆశ్చర్యం... ఆనందం ఆమెలో పోటీ పడుతున్నాయి.

''అవును''

''నిజంగా ఇస్తావా?'' మళ్లీ ఆమెలో అపనమ్మకం.

''నీకంత అనుమానంగా వుంటే ఇప్పుడే ఇస్తాను'' జేబులోనుంచి వంద నోటు తీసి ఆమె చేతిలో వుంచాడు.

ఆమె ఆనందానికి అంతే లేదు! ఆ నోటుని అటుతిప్పి ఇటుతిప్పి మార్చి మార్చి చూసింది. ఆమెకళ్లు తళతళలాడాయి. ఆట బొమ్మలనిచూసిన పాపాయిలా సంతోషంతో ఆ నోటుని అపురూపంగాస్పృశించి —

''ఇదిచూసి పిన్ని ఎంత ఆనందపడిపోద్దో '' అనుకుంటూ పక్కన పెట్టుకుని నేను ఏం సాయంచెయ్యను దొరా?'' సిన్సియర్గా అడిగింది.

''కాసేపు ఇలా పడుకో'' ఆమెని పూలచెండులా అపురూపంగా వెనక్కి వాల్చాడు.

''ఇలా పడుకోటానికి వంద ఇస్తే మా గూడెపు ఆడపిల్లలంతా లగెత్తుకొస్తారు'' కిలకిలా నవ్వింది ముత్యాలు రాలినట్టు.

ఆ మాటని శ్రీరాప్ పట్టించుకోలేదు. అతని మనసు... శరీరం ఎప్పుడెప్పుడా అని

ఆ(తుతపడుతున్నాయి. "ఇప్పుడు కళ్లు మూసుకో" అన్నాడు.

ఆమె మంచి బాలికలా కళ్లు మూసుకుంది.

తను మంచంమీద కూచుని ఆమెని వత్తిగిలచేశాడు. తమకంతో వీపుమీద జాకెట్టు తాలూకు తాళ్లు ముడివిప్పాడు. అతనిలో కోరిక జలపాతంలా వురుకుతోంది.... అతని వంట్లో రక్తం సలసలా మరిగిపోతోంది. అతని నరాల్లో తియ్యటి బాధ తాలూకు సలపరం మొదలైంది.

ఆ(తంగా... ఆరాటంగా... బలమైన కోరికతో ముడివిప్పిన జాకెట్‌ని వేరుచేశాడు అంతే...!

(శ్రీ)రామ్ ఒక్కసారిగా వెయ్యి వోల్టుల కరెంట్ షాక్ తగిలినట్టు చెయ్యి వెనక్కి లాక్కున్నాడు. కళ్లు విప్పార్చుకుని ఆమెకేసి భయంగా చూశాడు.


లేత గులాబి రంగులో అరగదీసిన మంచిగంధపు చెక్కలా వున్న ఆమె వంటిమీద ఎ(రటి వాతలు. భుజం పట్టుకుని వెల్లకిలా తిప్పి... గుండెలమీది జాకెట్‌ని తప్పించాడు. భయంతో అతని కళ్లు వెడల్పయినాయి. మొగ్గలా వున్న వక్షోజాలమీద ఎ(రటి వాతలు.

ఆ వాతలు అతని మనసుని కలచివేశాయి. అప్పటివరకు వెల్లువలా పొంగిన కోరిక ఒక్కసారిగా చప్పున చల్లారిపోయింది. మోతీ... మోతీ... అతని మనసు బాధగా మూలిగింది. మూగగా రోధించింది.

"మోతీ... ఏయ్ మోతీ నీ వంటిమీద ... వాతలేంటి" ఆమెని కుదుపుతూ అడిగేడు.

"నే కళ్లు తెరవనా దొరా" అమాయకంగా అడిగింది.మనసుని పిండేసే అంత బాధలోనో ఆమె అమాయకత్వానికి బాధేసింది. జాలీ కలిగింది.

"సర్లే! కళ్లు తెరు! ఇంత దారుణానికి వడిగట్టిందెవరూ?" ఆమెని వళ్లోకి చేర్చుకుంటూ అడిగేడు.



ఆ స్పర్శలో కోరికలేదు. కాంక్షలేదు... అతని కళ్లల్లో కామం తాలూకు ఎర్రజీరలు పోయి కరుణ... జాలి... ఆర్ద్రత వచ్చి చేరినయ్. ఆ స్పర్శలో ఆర్తి వుంది. ఆ అడగడంలో ఆదరణ వుంది.

"ఏ దారుణం?" ఆమెకి అర్థంకాక అడిగింది.

"ఇదుగో!" ఆమెగుండెల్ని చూపాడు.

నగ్నంగా వున్న తన గుండెల్ని చూసి ఆమె ఏమాత్రం సిగ్గుపడలేదు.

"ఇలా మా పిన్ని పెట్టింది" అంది మామూలుగా.

"మీ అమ్మ లేదా?" కుడిచేత్తో ఆమె జుత్తు సవరిస్తూ అడిగేడు.

ఆమె మొహం చిన్నపోయింది. "సచ్చిపోనాది దొరా! మా అయ్య మారుమనువాడినాడు. ఈ అడవంతా అమ్మి సొమ్ము చేసినా మా పిన్నికి చాలదు. ఆశెక్కువ"

"ఎన్ని కట్టెలమ్మినా పది రూపాయలు రావు. ఈ వందా సూసి మా పిన్ని శానా సంబరపడుద్ది. రోజూ తవరు పనిసెప్పి వందిస్తే నాకు వాతలు... దెబ్బలబాధ తప్పుద్ది. సెప్పండి దొరా! రోజూ తవరు ఏ పనిసెప్పినా సేత్తాను! నిజం దొరా మా అమ్మ మీదొ... కాదు... కాదు... నా మీదొట్టు" చెయ్యి నెత్తిమీద పెట్టుకుని కళ్లలోకి చూస్తూ ఆల్చిప్పల్లాంటి కళ్లతో అమాయకంగా అడుగుతోంటే?

శ్రీరామ్‌కు మనసు భారమైంది. స్వచ్ఛమైన ఈ అడవిమల్లెనా కపటప్రేమతో నలిపి కాలరాయాలనుకున్నది? ఛీఛీ తనూ ఒక మనిషేనా? ఏ భయమూ, అనుమానం లేకుండా పాపాయిలా తన వొడిలో వున్న ఈ అమాయకురాలినా తను మోసం చేయాలనుకున్నది.

ఆమె నిశ్చింతని తను వమ్ముచేయకూడదు. తను మనిషిలా మారాలి. కాదు. కాదు మనసున్న మనిషిలా... మానవత్వమున్న మనిషిలా ప్రవర్తించాలి. తొలిసారిగా స్త్రీపట్ల అనురాగం... ప్రేమ అంకురించాయి. అతని మనసు తేలికైంది.

"మోతీ! రోజా నీకు దెబ్బలు పడకుండా చూస్తాను" భరోసా ఇచ్చాడు.

"హై... అయితే రోజా వందరూపాయలిస్తారా?" ఆశగా అడిగింది.

"ఇవ్వను" కరుకుగా వుందతని గొంతు.

"మరెలా?" పెదాలు అదోరకంగా పెట్టి... భయంతో కళ్లు రెపరెపలాడించింది.

"ఇలా" ఆమె ఎదమీది బట్ట సవరించి... ఆమె కళ్లమీద ప్రేమగా ముద్దుపెట్టుకుని అన్నాడు.

"అంటే?"

"అంటే ఈ అందాల బొమ్మని నా భార్యగా చేసుకుని... ఇలా నాగుండెల్లో దాచుకుని రక్షిస్తాను" అన్నాడు ఆమె వీపుచుట్టూ చేతులు చుట్టి హృదయానికి హత్తుకుంటూ కళ్లు అరమోడ్పులవుతుండగా.

◇ ◆ ◇